


# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 336 మంగళవారం 14 జనవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ,స్పీకర్ ఓం బిర్లా చిరంజీవి,**

న్యూఢిల్లీ,/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. మిగతాది 2లో...

# పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం కావాలి

**తెలంగాణలో సానుకూలతలను ప్రపంచానికిపరిచయం చేయండి**

**మన పారిశ్రామికవిధానం ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది ప్రభుత్వ**

**పథకాలు,అభివృద్ధి పనులు రాష్ట్రాన్నిబలమైన ఆర్థికవ్యవస్థగా నిలబెట్టాయి**

**ఐటి, పరిశ్రమలశాఖ అధికారులతో సిఎంరేవంత్‌రెడ్డి సమీక్ష**

**గత దావోస్ పర్యటనలోపెట్టుబడుల సమీకరణ, పురోగతిపై ఆరా**

**ఈ నెల 16 నుంచి 22 వరకు మళ్లీ సింగపూర్,దావోస్ పర్యటనకు ముఖ్యమంత్రి**



హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): పెట్టుబడులకు గమ్యస్థానంగాఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అ న్నారు. దేశ, విదేశాల్లో పేరొందిన కంపెనీ లు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అ నుకూలమైన వాతావరణముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతు న్న హైదరాబాద్ పరిధిలో ఉన్న సానుకూలతల ను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సిఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తోందని సి ఎం రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులన్నీ మిగతాది 2లో...

## బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ నిధికి కేటాయింపులు

**పెంచిన మొత్తం అందచేసేలా ప్రణాళికలు**




2లో.

## ప్రారంభమైన మహాకుంభమేళా

**తొలిరోజే కోటిన్నరమంది పుణ్యస్నానాలు**



2లో.

# ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

**మంచి పనులు చేసి శభాష్ అనిపించుకుంటాం**

**సాగునీటి సమస్యలను తీర్చేలా కార్యాచరణ**

**పది నియోజకవర్గాలకు నీరందించే బాధ్యత మాదే**

**మంచుకొండ ఎత్తిపోతల పథకానికి మంత్రుల శంకుస్థాపన**




ఖమ్మం/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు తీసుకు వస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. పది వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే.. పాలేరుకు గోదావరి జలాలు వస్తాయన్నారు. ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలు సస్యశ్యామలం చేయాలన్నదే తన రాజకీయ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే సీతారామ ప్రాజెక్ట్ పూర్తి కావడంతోపాటు భద్రాచలంకి రైల్వే లైన్, కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ రావాలన్నారు. మీ కష్టాలు తెలుసు, మీ అవసరాలు సైతం తనకు తెలుసునన్నారు. అన్ని పనులు పూర్తి చేసి.. మీతో శబాష్ అనిపించుకుంటా నని.. అంతే తప్ప. ఛీ ఛీ అని మాత్రం అనిపించుకోనని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకానికి తుమ్మలతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి,

# ఎంఎల్ఎ కౌశిక్‌రెడ్డి అరెస్టు

**హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న కరీంనగర్ పోలీసులు**

**కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలిపై స్పీకర్ ఆగ్రహం చర్యలు తీసుకోవాలని సభాపతికి ఫిర్యాదు**

**అరెస్టు దుర్మార్గమైన చర్య**

**ప్రశ్నిస్తే అణిచివేతలా? : కెటిఆర్**

**బేషరతుగా విడుదల చేయాలని బిఆర్ఎస్ డిమాండ్**



2లో

# కొత్త రేషన్‌కార్డుల మార్గదర్శకాలు

**గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక లబ్ధిదారులవివరాలతో ఫ్లెక్సీలు**

**సంక్షేమ పథకాల అమల్లోఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం**

**రేషన్‌కార్డులజారీ నిరంతర ప్రక్రియ**

**వ్యవసాయయోగ్యమైన ప్రతి ఎకరాకు రైతుభరోసా కులాలు, పార్టీలకతీతంగా ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు పథకాలసమీక్షాసమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

2లో



# పసుపు బోర్డును ఏర్పాటుచేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం



3లో

# కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

# ప్రారంభమైన మహాకుంభమేళా

'మహా కుంభమేళా తొలిరోజు సనాతన ధర్మాన్ని ఆచరించే 1.50 కోట్ల మంది స్వచ్ఛమైన త్రివేణీ జలాల్లో పవిత్ర స్నానాలు చేయడం ద్వారా ఈ పండుగను విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన మహాకుంభ మేళా అడ్మినిస్ట్రేషన్, ప్రయాగ్‌రాజ్ అడ్మినిస్ట్రేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రయాగరాజ్, స్వచ్ఛాగ్రహీలు, గంగా సేవాదూత్‌లు, కుంభ్ సేవక్లు, మత–సామాజిక సంస్థలు, వివిధ వాలంటీర్లు, మిత్రులు, మీడియా ప్రపంచం సహా మహాకుంభ్‌తో మమేకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలకు ధన్యవాదాలు తెలియజేస్తు?న్నాను' అని యోగి పేర్కొన్నారు.'మహాకుంభ్' భిన్నత్వంలో ఏకత్వం సందేశాన్ని చాటుతూ భిన్న సంస్కృతులను ఏకం చేస్తోందని యోగి ఆదిత్యనాథ్ ఒక ట్వీట్‌లో అభివర్ణించారు. సాంస్కృతీ సమ్మేళనం ఎక్కడుంటుందో విశ్వాసం, సామరస్యం అక్కడే ఉంటుందన్నారు. ప్రయోగ్‌రాజ్ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. కాగా, తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు, తీవ్రమైన చలిగాలులు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలకు ఎంతో ఉత్సాహంగా తరలివచ్చారు. వయోభేదం లేకుండా అన్ని రంగాలకు చెందిన ప్రజలు పవిత్ర స్నానాలతో పులకించిపోయారు. భజనలు, జై గంగా మయ్యా నినాదాలు మధ్య 'మహాకుంభ్' అంగరంగ వైభవంగా మొదలైంది.

# బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ నిధికి కేటాయింపులు

## పెంచిన మొత్తం అందచేసేలా ప్రణాళికలు

న్యూఢిల్లీ,/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పూర్తి బడ్జెట్లో రైతులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద వార్షికంగా వచ్చే మొత్తం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పలు వర్గాల సమాచారం ప్రకారం రైతులకు చెల్లించే వార్షిక మొత్తం రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో ఈ పథకంలో నమోదు చేసుకున్న రైతులందరూ దీని ప్రయోజనాన్ని పొందనున్నారు. బ్జడెట్ మొదటి రోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీని గురించి అధికారికంగా ఎవరూ ప్రకటించలేదు. కానీ పెంచే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఒక్కొక్కటి రూ. 2,000 చొప్పున మూడు వాయిదాలలో రూ. 6,000 అందిస్తుంది. ప్రతి వాయిదా చెల్లింపుల మధ్య నాలుగు నెలల అంతరం ఉంటుంది. తదుపరి విడత డబ్బును ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బడ్జెట్లో ఈ మొత్తం పెంచిన తర్వాత, పెరిగిన మొత్తం చెల్లిస్తారా లేదా పాత వాయిదా వస్తుందా అని రైతులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం రైతులకు పూర్తి ప్రయోజనం లభిస్తుంది. కెవైసి పూర్తి చేయని రైతులు ఈ పథకం ప్రయోజనాలు పొందలేరు. అయితే గతంలో రైతులు ఏడాదికి రూ. 6 వేలను మూడు వాయిదాలను పొందుతారు. ఇప్పుడు పెంచనున్న రూ.10 వేల మొత్తాన్ని మూడు వాయిదాలలో ఎలా చెల్లిస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం కింద అందించే మొత్తం రూ.10,000 అందిస్తే రైతులకు వ్యవసాయ పనులు, కూలీలకు, కరెంట్ సహా ఇతర ఖర్చులకు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా చిన్న రైతులకు ఈ మొత్తం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నిధులు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 1న ప్రారంభించింది. ఈ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా ఉంది.

# ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

**(మొదటి పేజీ తరువాయి)**

పొంగిలేటి శ్రీనివాసరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. అనంతరం వరుసగా మంత్రులు మాట్లాడారు. ఆ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది సత్తుపల్లి ట్రంక్ పూర్తి చేసి గోదావరి జలాలను పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. పామాయిల్ సాగు చేయాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన పిలుపు నిచ్చారు. ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీలు స్థాపించి.. రైతులను రాజులుగా నిలబెట్టే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన పేర్కొన్నారు. 46 మండలాలకు సాగు నీరు అందించే భాగ్యం తనకు దక్కిందంటూ మంత్రి తుమ్మల ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఒక్క రఘునాథ పాలెం మండలానికి సాగు నీరు ఇవ్వలేక పోయానన్న బాధ గతంలో ఉండేదని.. ఇప్పుడా ఆ బాధ సైతం తనకు లేదన్నారు. మీరు పామాయిల్ సాగు చేయండి.. ఉగాది నాటికి సాగు నీరు తీసుకు వచ్చి మీ మొక్కలు బతికిస్తాంటూ రైతులకు మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది పూర్తియిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒకోక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ప్రతిపక్షం అవాక్కులు చవాక్కులు పేలినా.. వాటిని పట్టించుకోకుండా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి పేద వాడికి అభివృద్ధి సంక్షేమం అందజేస్తామన్నారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2500 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అపర భగీరథుడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీకు మంత్రిగా ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. మంత్రులమంతా సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మంచుకొండ ఎత్తిపోతల ప్రాజెక్ట్ ను తక్కువ ఖర్చు రూ. 54 కోట్లతో 2,500 ఎకరాలకు సాగునీరు అందించనుండడం సంతోషంగా ఉందన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు తాము అమలు చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లాకు వ్యవసాయంతో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను మంత్రి తుమ్మల పట్టబట్టి మరి సాధించారన్నారు. సంక్రాంతి కానుకగా రఘునాథపాలెం ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఇవ్వాలని తుమ్మల పట్టుబట్టారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మంత్రులమందరం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. రూ.1.8 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రంగా ఆయకట్టు నిర్మించినా.. సాగులోకి మాత్రం తీసుకు రాలేదన్నారు. రూ. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మించి.. ఒక్క ఎకరాకు సైతం సాగు నీరు అందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా రైతులు పంట పండించారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు తీసుకు వస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని ఆయన పేర్కొన్నారు.

# పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం కావాలి

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని ఆయన అన్నారు. జూ బ్లీహిల్స్‌లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అ ధికారులతో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సి ఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎం ప్రత్యే క కార్యదర్శి అజిత్ రెడ్డి, టిజిఐఐసీ ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.జనవరి 20వ తేదీ నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. గత ఏడాది ప్రభుత్వంతో ఒ ప్పం దం చేసుకున్న ఏయే కంపెనీ లు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి. అవి ఏయే దశలో ఉన్నాయని సిఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పె ట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరా యి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని అధికారులు సిఎంకు వివరించా రు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబుతో సిఎం చర్చించారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు సింగపూర్, 20 నుంచి 22వ తేదీ వరకు ముఖ్యమంత్రి దావోస్‌లో పర్యటించనున్నారు. సిఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ఉంటా రు. సింగపూర్‌లో స్కిల్ వర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు పలు సంస్థలతో సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌తో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సిఎంకు వివరించారు.

# సందడిగా కైట్ ఫెస్టివల్

## చిన్న పెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): : సంక్రాంతి పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ముగ్గులు.. ఆ తరువాత పతంగులు. సంక్రాంతి సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా కైట్స్ ఎగురవేస్తుంటారు. మహిళలు ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులతో పండుగను జరుపుకోగా.. మగవారు పతంగులు ఎగురవేస్తూ ఆడి పాడి ఎంజాయ్ చేస్తుంటారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తుంటారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు చోట్ల కైట్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని పతంగులు ఎగురవేస్తారు. ఒకరితో ఒకరు పోటీ పడి మరీ గాలిపటాలను ఎగురవేస్తారు. వివిధ రకాల పతంగులు ప్రస్తుతం మార్కెట్లలో లభిస్తున్నాయి. ఇక చిన్న పిల్లల జోష్ మామూలుగా ఉండదు. ఇంట్లోని తమ తండ్రి, అన్నలతో కలిసి పిల్లలు కైట్స్‌ను ఎగురవేస్తూ ఆనందిస్తుండగా.. యువత తమ స్నేహితులతో కలిసి పతంగులు ఎగురవేస్తారు. అలాగే కైట్స్ ఫెస్టివల్‌ను డీజే మోతతో హోరెత్తిస్తుంటారు. మరోవైపు హైదరాబాద్‌లో పతంగుల సందడి మొదలైంది. సిటీలోని పలు ప్రాంతాల్లో కైట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. డీజే హోరు మధ్య భవనాలపై పతంగులు ఎగురుస్తున్నారు యువత. పోటాపోటీగా పతంగులు ఎగరేస్తూ యువత సందడి చేస్తోంది. బోయినపల్లిలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌లో చిన్నారులతో కలిసి మాజీ మంత్రి మల్లారెడ్డి పతంగులు ఎగిరవేశారు. మరోవైపు హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు 7వ అంతర్జాతీయ కైట్



ఫెస్టివల్ జరుగనుంది. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈరోజు సాయంత్రం 4 గంటలకు నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్ ప్రారంభమవగా.. దాదాపు 19 దేశాల నుంచి 47 మంది ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లైయర్స్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారు. అలాగే14 రాష్ట్రాల నుంచి కైట్ ఫెస్టివల్‌లో 54 మంది నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లైయర్స్ పాల్గొంటారు. పతంగుల పండుగకు ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కంబోడియా, స్కాట్లాండ్, థాయిలాండ్, కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా, ఇటలీ, తైవాన్, సౌత్ ఆఫ్రికా, నెదర్లాండ్స్, తదితర దేశాలకు చెందిన 50 మంది కైట్ ఫ్లైయర్స్ హాజరుకానున్నారు. అలాగే గుజరాత్, పంజాబ్, తమిళనాడు, కేరళ, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన 60 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కైట్ ఫెస్టివల్ జరుగనుంది.

# ఎంఎల్ఏ కౌశిక్‌రెడ్డి అరెస్టు

హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): హుజురాబాద్ ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో ఉన్న ఓ టీవీ చానెల్ డిబేట్ ప్రోగ్రాంలో పాల్గొని బయటకు వచ్చినప్పుడు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమీక్షా సమావేశంలో జరిగిన ఘటనపై ఆయనపై మూడు కేసులు నమోదు అయ్యాయి. కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పీఏ కత్తురోజు వినోద్ అలియాస్ గిరి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు.ఈ నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా శాసనసభ స్పీకర్ ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ వన్ టౌన్ కు చేరుకున్న డాక్టర్ సంజయ్ కుమార్ పోలీసులకు వాంగ్మూలం కూడా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన కౌశిక్ రెడ్డి తీరుపై ఘాటుగా స్పందించారు. అయితే ఎవరూ ఊహించని విధంగా కరీంనగర్ పోలీసులు కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేకంగా హైదరాబాద్ వెళ్లింది. రాత్రి ఆయనను అదుపులోకి తీసుకుని కరీంనగర్ కు తరలిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ రోజు రాత్రి కానీ రేపు ఉదయం కోర్టులో హాజరు పర్చనున్నట్టుగా తెలుస్తోంది.

# అధికార లాంఛనాలతో మంద జగన్నాథం అంత్యక్రియలు

హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జగన్నాథం అంత్యక్రియలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మందా జగన్నాథం.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా మధుమేహం, రక్తపోటు, గుండె, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నారు. గత నెల 22న ఊపిరితిత్తుల సమస్య రావడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌లో చేర్చారు. రోజురోజుకూ పరిస్థితి విషమించడంతో ఆయనను ఆర్ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గుండెపోటు రాగా, వెంటనే అత్యవసర వైద్య చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. రాత్రి 7.40గంటలకు మృతిచెందినట్టు నిమ్స్ వైద్యులు బులెటిన్ విడుదల చేశారు. మందా జగన్నాథం భౌతికకాయాన్ని నిమ్స్ నుంచి హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సంతోష్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, ప్రస్తుత ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో పెద్దపుల్లయ్య– మంద సవారమ్మ దంపతులకు 1951 మే 22వ తేదీన మందా జగన్నాథం జన్మించారు. ఆయన తండ్రి నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా, తల్లి సవారమ్మ హిల్‌కాలనీలో ఆఫీస్ అటెండెంట్‌గా పని చేశారు. విద్యాభ్యాసం అనంతరం వైద్య వృత్తిలో కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ నుంచి పోటీచేసి నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా కొనసాగారు. తర్వాత కొంతకాలానికి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1996, 1999, 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014 మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగు జాడల్లో నడిచారు.

# కొత్త రేషన్‌కార్డుల మార్గదర్శకాలు




హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు(ఆహార భద్రత కార్డులు) మంజూరుపై ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. దీంతో ఇప్పటి వరకు తెల్ల రేషన్ కార్డులు లేనివారికి అవకాశం కలుగుతుంది. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫార్సులకు లోబడి కొత్త ఆహార భద్రత(రేషన్) కార్డుల జారీకి సంబంధించి అర్హత ప్రమాణాలు, విధానాలు పరిగణలోకి తీసుకోనున్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా ఇప్పటి వరకు రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాలను ఆయా జిల్లా కలెక్టర్లు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కమిషనర్‌కు పరిశీలన కోసం పంపిస్తారు.మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల పరిధిలో కమిషనర్లు ఈ ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారు. ముసాయిదాజాబితాను గ్రామసభ వార్డులో ప్రదర్శించి చర్చిస్తారు. గ్రామసభ ఆమోదం తదుపరి లబ్ధిదారుల లాగిన్‌లో నమోదుచేసి జిల్లా కలెక్టర్, హైదరాబాద్‌లో అయితే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు పంపిస్తారు. వారి పరిశీలన తదుపరి ఫైనల్ జాబితాను రూపొందిస్తారు. అర్హత కలిగిన వ్యక్తికి ఒకే ఒక్క అహార భద్రత(రేషన్)కార్డు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆహారభద్రత కార్డుల్లో కుటుంబసభ్యులు చేర్పులు, తొలగింపులు చేసే అవకాశం ఉంటుంది.



## మన పంట కాలువ మన బాధ్యత



తల్లాడ/జనవరి013(జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలంలోని సిరిపురం మేజర్ కాలువపై గల తెలగవరం మైనర్ కాలువ లో నీళ్లు పోకుండా అధ్వానంగా ఉన్నది. దీనికి రైతు సోదరులు పంట పండించే మిర్చి, మొక్కజొన్న , వరి పంటలకు నీళ్లు పెట్టుకోవడానికి చాలా ఇబ్బంది గురికావడంతో ఈ సమస్యను సోమవారం వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరావు ,కి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ,కి తెలియపరచగా వారిఆదేశాల మేరకు బిల్లుపాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ ,ఆధ్వర్యంలో కాలువ ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి, కాలవ లోపల ఉన్న చెట్లను, గుర్రపు డెక్క, తూటికాడ పేరుకుపోయి ఉన్న చెత్తను చైన్ మిషన్ తో రైతులు సమక్షంలో దగ్గర ఉండి కాలువ పనులు పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ , బిల్లుపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ , మారెళ్ళ మల్లికార్జున రావు , రైతు సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చిల్లాపురం లో ముగ్గుల పోటీలు



నలగొండ/జనవరి0 13(జర్నలిస్టు వార్త):
మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో ఎక్కువమంది యువతలు పాల్గొని ముగ్గుల విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి పాల్గొని వారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బసవయ్య గౌడ్, పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సజ్జల నరసింహారెడ్డి అనుముల శ్రీనివాస్, డీలర్ శ్రీను, వెంకన్న, నాగయ్య, రామలింగయ్య, బిక్షం, మచ్చ సైదులు, బూర సైదులు, కనకయ్య, లక్ష్మీనారాయణ, రాజు, సుధాకర్, కాంగ్రెస్ యువకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును ఏర్పాటుచేస్తూ నిర్ణయం

హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): : పసుపు రైతుల కల నేటికి ఫలించింది. ఎన్నో ఏండ్లుగా వారు ఎదుర్కొంటున్న కష్టాలను కేంద్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలకు తెరదీస్తూ కేంద్ర ప్రభుత్వం పసుపు పంటను ఒక ప్రత్యకమైన పరిశ్రమగా గుర్తిస్తూ పసుపు బోర్డును ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో నిజామాబాద్ జిల్లాలో పసుపుబోర్డు రాజకీయాలకు కేంద్రం తెరదించింది. సంక్రాంతి పండగ సందర్భంగా జాతీయ పసుపుబోర్డు ఏర్పాటుకు అధికారికంగా వెల్లడించడంతో పాటు పసుపుబోర్డుకు తొలి చైర్మన్‌గా పల్లె గంగారెడ్డిని నియమిస్తూ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినేట్(ఏసీసీ) నోటిఫికేషన్‌కు విడుదల చేసింది. నిజామాబాద్ జిల్లా అర్మూర్ మండలం పరిధిలోని అంకాపూర్ గ్రామానికి చెందిన పల్లె గంగారెడ్డి మూడు సంవత్సరాల పాటు జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా కొనసాగుతారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయం వల్ల రాష్ట్రంలో పసుపు రైతుల పసుపపంట ఉత్పత్తులకు సంపూర్ణ న్యాయం జరిగే అవకాశాలున్నాయి.



నిజామాబాద్‌లో మంగళవారం నాడు జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం అధికారికంగా జరుగుతుంది. కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోల్ వర్చువల్‌గా జాతీయ పసుపుబోర్డును ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి బాధ్యతలు చేపట్టడంతో పాటు పసుపురైతుల సమస్యల పరిష్కారంపై విధానపరమైన ప్రకటన చేసే అవకాశం ఉంది.జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు కొత్త అవకాశాలు కలుగనున్నాయి. పసుపు పంటకు గిట్టుబాటు ధరలు దక్కనున్నాయి. బోర్డు ద్వారా పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే అవకాశాలు లేకపోలేదు. ఇకపై పసుపు ఎగుమతులకు గణనీయమైన అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్‌లో జాతీయ పసుపుబోర్డు ఏర్పాటు చేయడం పట్ల ఎంపీ ధర్మపురి అర్వింద్ హర్షం వ్యక్తం చేశారు. పసుపురైతుల కష్టాలను గుర్తించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బోర్డు ఏర్పాటుచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ 37 సంవత్సరాల పసుపురైతుల కల ఈనాడు నెరవేరడం సంతోషకరమన్నారు.

**ప్రధాని రైతుల పక్షపాతి : కిషన్ రెడ్డి**

జాతీయ పసుపుబోర్డు ఏర్పాటుచేయడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతు పక్షపాతిగా చాటుకున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయంగా ఆయన అభివర్ణించారు.

# థమ్సప్ కంపెనీ, తల్లాడ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ముగ్గుల పోటీలు

తల్లాడ/జనవరి013(జర్నలిస్ట్ వార్త): తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం థమ్సప్ కంపెనీ, తల్లాడ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ముగ్గుల (రంగవల్లులు) పోటీలు నారాయణపురం కోదండ రామాలయం ఎదురుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా తల్లాడ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొండల రావు సమక్షంలో నిమ్మి కంటి సరోజినీ హెచ్ఎం వేమిశెట్టి రమాదేవి ముగ్గులను ఇద్దరు న్యాయ నిర్ణయంతోపరిశీలించి ప్రధమ, ద్వితీయ, తృతీయ, అవార్డులను ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళలందరికీ కన్సలేషన్ బహుమతులు అందజేశారు. ఎస్ఐ కొండలరావు , మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణపురం గ్రామం నందు ముగ్గుల పోటీలు నిర్వహించటం అభినందనీయమని గ్రామ మహిళలందరూ ఎంతో ఉత్సాహంతో కష్టపడి రంగవల్లులను వేయడం జరిగింది. ఈ సందర్భంగా భోగి, సంక్రాంతి, కనుమ, పండగ శుభాకాంక్షలు అందరికీ తెలియజేశారు. తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు, సభ్యులు



గ్రామ పెద్దలు వేమిరెడ్డి కృష్ణారెడ్డి , రెడ్డెం వీర మోహన్ రెడ్డి, పొట్టేటి జనార్దన్ రెడ్డి,వెధురు కృష్ణారెడ్డి, గొడుగునూరు లక్ష్మారెడ్డి, లయన్స్ క్లబ్ డిస్టిక్జిఎల్టి కోఆర్డినేటర్ కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, వీరందరూ మాట్లాడుతూ సనాతన మన సాంప్రదాయం సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గులు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టి వాటిని పూజించి ఎంతో నియమ నిష్ఠలతో మహిళలు అందరూ ఉత్సాహంగా జరుపుకునే పండగ సంక్రాంతి పండగ దీని సందర్భంగా




నారాయణపురం గ్రామంలో లయన్స్ క్లబ్ వారు థమ్స అప్ వారు ఈ ముగ్గుల పోటీలను నిర్వహించటం సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో డిసి వేమిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి వారి సమక్షంలో సెక్రటరీ కటికి వెంకటేశ్వరరావు, ట్రెజరర్ శీలం వెంకటరెడ్డి,లయన్స్ క్లబ్ సభ్యులు వేమిరెడ్డి సీతారాంరెడ్డి రెడ్డెం రామకృష్ణారెడ్డి, వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి, వేమిరెడ్డి నాగిరెడ్డి, లాయర్ గుర్రాల రామ్ బ్రహ్మ రెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో మర్లపెల్లి డిఆర్ డిపో

## గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ భవనం





బోథ్ /జనవరి013(జర్నలిస్ట్ వార్త): మార్లపెల్లి గ్రామంలో గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే గిరిజన ప్రైమరీ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ భవనం శితిలావస్థలో ఉంది.అన్ని పిచ్చి మొక్కలు మొలిచాయి.అసంగిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. గతంలో ఈ భవనంలో తొమ్మిది గ్రామాలకు ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరుకులు అన్ని దోరికేవి.ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం,కిరోసిన్, గిరిజన ఉతపత్తులు.సార పలుకులు,తేనె,కరక్కాయ,జీడీ గింజలు,విషముస్టి గింజలు,ఇప్పపువ్వు, తిరుమన్ బంక, తోవసి బంక జీసీసీ వారు ఇక్కడ కొనేవారు. గిరిజనులకు ఉపాధిగా ఉండేది.ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఉచిత సన్న బియ్యం ఎక్కడ ఇవ్వాలో తెలియటం లేదు. గ్రామస్థుల చోరువతో యూత్ క్లోబ్ లో ఉచిత బియ్యం పంపిణి చేపడుతున్నారు.ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జీసీసీ వారు నూతన భవనం నిర్మించాలని.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనం రిపేర్ చేయాలని కోరుకుంటున్నారు గిరిజన గ్రామ ప్రజలు.



## ఘనంగా భోగి పండుగ వేడుకలు



తల్లాడ/జనవరి013(జర్నలిస్ట్ వార్త): తల్లాడ మేజర్ పంచాయతీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున కుటుంబ సమేతంగా భోగిమంటలు వేసి ఆనందంగా గడిపారు. కులమతలకు అతీతంగా అందరూ కలిసి వేడుకలను జరుపుకున్నారు. స్థానిక గ్రామస్తులు, యువకులు, మహిళలు భోగిమంటల వేడుకల సంబరాలు చేసుకున్నారు. డూ డూ బసవన్న ఆటలు, గంగిరెద్దుల నృత్యాలు, సంక్రాంతి గేయాలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరికీ ఆయన పేరుపేరునా సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొక్కా కృష్ణార్జున రావు, పోలేపల్లి నాగేశ్వరావు, గుడిపల్లి సత్యం, మొక్క సత్యనారాయణ.పెరిక రాము, అనువాల రామకృష్ణ. మొక్క నరసరావు. నేలపూలు లాలయ్య. మొక్క సైదులు.అయ్యప్ప, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అత్యాశకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దు

**-పండుగను కుటుంబసభ్యులతో జరుపుకోవాలి -తల్లాడ ఎస్సై కొండలరావు సూచన**

తల్లాడ/జనవరి 013(జర్నలిస్టు వార్త): సంక్రాంతి పర్వదినాన్ని ప్రతిఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని తల్లాడ ఎస్సై కొండలరావు సూచించారు. యువత కోడిపందాలు, పేకాట, జూదం తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఒక్కసారిగా సంపాదించాలనే అత్యాశకు పోయి బెట్టింగులు, పందేలకు పాల్పడితే కుటుంబాలు చిందరవందర అవుతాయని అన్నారు. కష్టపడిన సొమ్ముకే విలువ ఉంటుందని, ఎవరూ కూడా డబ్బు వస్తుందనే అత్యాశకు పోయి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు. యువత మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని, చట్టాలు కఠినంగా ఉన్నందునా జాగ్రత్తగా ఉండాలన్నారు. పండుగ పూట కుటుంబ సభ్యులతో పిల్లాపాపలతో ఆనందోత్సాహాల నడుము ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



## చిల్లాపురంలో సంక్రాంత వేడుకలు



నలగొండ/జనవరి013(జర్నలిస్టు వార్త): మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలోని సంక్రాంతి పండుగ పురస్కరించుకొని సోమవారం ట్రాక్టర్ ట్రక్కుతో రివర్స్ పోటీలను మోదాల చిన్న వెంకన్న,మోదాల వెంకన్న, మల్లికంటి వెంకన్న, ఆధ్వర్యంలో నిర్వహించగా గ్రామ రైతులు ట్రాక్టర్ డ్రైవర్లు యువకులు పోటీపడి ట్రాక్టర్ రివర్స్ పోటీలో పాల్గొని విజయవంతం చేశారు. పోటీలో గెలుపొందిన విజేతలు దైద ప్రభాకర్,అనుముల నవీన్ రెడ్డి, కలకుంట్ల పరిపూర్ణ చారి గెలుపొందగా వారికి దాతలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మొదాల చిన్న వెంకన్న మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే రైతుల పండుగ అని రైతులు ఆరు కాలం శ్రమించి పండగల టైంలో నైనా ఇలాంటి వినోద కార్యక్రమాలు పోటీలు ఉండాలని రైతుల యొక్క పాడి పంటలు చల్లగా ఉండి ఆ దేవుని దీవెనలతో ప్రజలందరూ కూడా సుఖసంతోషాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డ్రైవర్ మోదాల వెంకటేశ్వర్లు గ్రామ రైతులు ట్రాక్టర్ డ్రైవర్లు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# 29వ అఖండ హరినామ మహాయజ్ఞోత్సవలు

## -నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్



బోథ్/జనవరి 013(జర్నలిస్ట్ వార్త): తలమడుగు మండలము లోని పల్సి(బి ) తండగ్రామం లో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ 29వ అఖండహరినామ మహాయజ్ఞొత్సవ కార్యక్రమంలో పాల్గొని శ్రీ సంత్ శ్రీసద్గురునారాయణబాబా యొక్క గుడిని దర్శించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అయన వెంట తలమడుగు తాజా మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి తాజా మాజీఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్ ఎంపీటీసీలు వెంకన్న యాదవ్ ,రమేష్ రెడ్డి ,కుర్మే మహేందర్ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి ,నియోజకవర్గ మండల యూత్ అధ్యక్షులు సాయికిరణ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, రాకేష్ ,కపిల్ దేవ్, గంగారం ,బాబుఖాన్, ప్రతాప్ సళ్ళ దేవన్న,మటం వెంకట్ రెడ్డి, కొమ్ము వెంకటేష్ రామ్ లఖన్ యువ నాయకులు సద్దాం, గ్రామ నాయక్ కార్యకర్తలు నాయకులు గ్రామస్తులు భక్తులు ఉన్నారు.

# కుక్కల దాడిలో గొర్రె మృతి

బోథ్/జనవరి013(జర్నలిస్ట్ వార్త):



కుక్కల దాడిలో గొర్రె మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో దన్నురు బి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలోకి వెళితే బోథ్ మండలంలోని ధన్నూరు బి గ్రామానికి చెందిన షేక్ పెద్ద మోహినుద్దీన్ కు చెందిన గొర్రెను కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. దీంతో కన్నీరు మున్నీరవుతున్న లబోదిబోమంటున్న బాధితుడు. ఈ సందర్భంగా బాధితుని వివరాల ప్రకారం మృతిచెందిన గొర్రె విలువ సుమారుగా 12 వేల వరకు ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు బాధితునికి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని ఎక్కడపడితే అక్కడ స్వైర విహారం చేస్తూ సంచరిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నేడు గొర్రె పై దాడి రేపటి రోజు మనుషుల చిన్న పిల్లల పైన కూడా దాడి చేయొచ్చని స్థానిక కాలనీవాసులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు గ్రామపంచాయతీ వారు కుక్కల నియంత్రణ పరంగా చర్యలు తీసుకోవాలని వాటిని అరికట్టాలని కోరుతున్నారు. కుక్కల స్వైర విహారాన్ని అరికట్టని గ్రామపంచాయతీ అధికారులు. మీ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం ఒక గొర్రె మృతి చెందినట్లు తెలిపారు పశుసంవర్ధక అధికారులు చొరవ తీసుకోని బాధితునికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## విజయం సాధించిన వాలీబాల్

# క్రీడాకారులకు ఘనంగా సన్మానం





పర్వతగిరి/జనవరి 13(జర్నలిస్ట్ వార్త): నెక్కొండ మండలం కేంద్రంలో వరంగల్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పర్వతగిరి వాలీబాల్ క్రీడాకారులు ద్వితీయ స్థానంలో బహుమతిని గెలుపొందారు. సోమవారం మండల కేంద్రంలో క్రీడాకారులను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు అభినందించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల శారీరకంగా దృఢత్వం కలిగి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. జిల్లాస్థాయిలో వాలీబాల్ ఆటలో ద్వితీయ స్థానం సాధించి పర్వతగిరి గ్రామనికి పేరు, ప్రతిష్టలు తీసుకొచ్చిన ప్రతి క్రీడాకారునికి ఆయన అభినందనలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ఇకముందు అనేక క్రీడాలలో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జట్టు కెప్టెన్ జంగా సారంగపాణి, వైస్ కప్టెన్ జంగా మని, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# పుదుచ్చేరిలో మరో శిశువుకు హెచ్ఎంపివి వైరస్

జనవరి 13(జర్నలిస్ట్ వార్త):




మరో శిశువుకు పుదుచ్చేరిలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్ఎంపివి) పాజిటివ్ అని తేలిందని, 'జిప్మేర్' ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఓ ఆడ శిశువుకు జ్వరం, దగ్గు, ముక్కు కారడం రావడంతో ఆసుత్రికి చికిత్స కోసం వచ్చినట్లు పుదుచ్చేరి హెల్త్ డైరెక్టర్ వి. రవిచంద్రన్ ఓ ప్రకటనలో తెలిపారు.

కొన్ని రోజుల క్రితమే ఆమె జిప్మేర్ ఆసుపత్రిలో చేరిందని, చికిత్స కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఆ శిశువు కోలుకుంటోందని, అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన తెలిపారు. పుదుచ్చేరిలో తొలి హెచ్ఎంపివి వ్యాధి ఓ మూడేళ్ల శిశువుకు గత వారం సోకగా, ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆ శిశువు కోలుకున్నాక శనివారం డిశ్చార్జ్ చేశారు. హెచ్ఎంపివి వెలుగుచూసిన నేపథ్యంలో పుదుచ్చేరి పాలకవర్గం అన్ని చర్యలు చేపట్టింది.

# ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సందడి

## - చిన్ననాటి జ్ఞాపకాలతో అపూర్వ సమ్మేళనం

**వర్ధన్నపేట/జనవరి 13,(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో 1990-91 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేస్తూ ప్రభుత్వ పాఠశాల సందడిగా మారింది. 33 సంవత్సరాల తర్వాత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయంగా సమావేశమై ఒకరినొకరు పలకరించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని చెప్పుకొచ్చారు. వారి జీవితంలో సాధించిన విజయాలను నెమరవేసుకున్నారు. సంవత్సరాల తరువాత కలుసుకున్న వారి జ్ఞాపకం మరిచిపోలేనిదని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 1990-91 విద్యార్థులకు చదువు నేర్పిన ఇంగ్లీష్ టీచర్ భాస్కర్ హాజరై తమ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధునిక కాలంలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులు పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అప్పటి విద్యార్థులు చదువుకున్న సమయంలో అందరికీ మానవ విలువలతో కూడిన సామాజిక %ఞ% ఆవాహన ఉందని, ఆ సమయంలో చదువుకున్న విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతంగా ఉన్నారని, ఎలాంటి వారి సామాజిక బాధ్యత గ్రామానికి, పాఠశాలకు అవసరమని భావించారు. భవిష్యత్తు విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్ఫూర్తిగా ఉండాలన్నారు. గత 33 సంవత్సరాల నుండి జీవితాలను నిలబెట్టుకోవడానికి ప్రయత్నించి, ఇప్పుడు కలుసుకోవడం అంటే మాటలు కాదన్నారు. పూర్వ విద్యార్థులంతా మునుముందు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి ఒకరికొకరు కలుసుకోవాలని ఆకాంక్షించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఈగ దామోదర్ మాట్లాడుతూ




ప్రతీ ఒక్కరు వ్యక్తిగత అభివృద్ధితో పాటు ల్యాబర్తి గ్రామ పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఒక్కొక్కరు అప్పటి బ్యాచ్ వారంతా వివిధ రంగాలల్లో స్థిరపడ్డందుకు సంతోషంగా ఉందన్నారు. ఆనాటి విద్యార్థుల జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ విద్యార్థి భావితరాలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు ఇన్ని సంవత్సరాలైనా చదువు చెప్పిన ఉపాధ్యాయులను జ్ఞాపకం చేసుకుని, సమావేశానికి ఆహ్వానించి సన్మానించడం ఆనందదాయకం అన్నారు. రాబోయే కాలంలో తమ విద్యార్థులు ఎలాంటి సలహాలు, సూచనలైన ఇవ్వడానికి వారు సిద్ధంగా ఉన్నామన్నారు. తాము చదువు నేర్పిన సమయంలో అనేక మంది విద్యార్థులు మ్యాస్ లో ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణత సాధించి, అనేక రంగాలలో స్థిరపడ్డారని తెలియజేశారు. విద్యార్థులంతా అనేక రంగాల స్థిరపడ్డారని, కొంతమంది వ్యవసాయ రంగంలో ఆదర్శ రైతులుగా, వ్యాపార రంగంలో హై స్థాయిలో, పోలీస్ అధికారులుగా, పాఠశాల టీచింగ్ స్టాఫ్ లో యూనివర్సిటీ ప్రొఫెసర్లు గా స్థిరపడంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ టీచర్ రాజమణి, తెలుగు టీచర్ ఆరూరి సూర్యం, సైన్స్ టీచర్ దమ్మన్నపేట యాకయ్య, ల్యాబర్తి టీచర్ హరిలాల్, 1990-91 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరికీ జ్ఞాపకం ఉండేలా ఆనాటి పదవ తరగతి బ్యాచ్ ఫోటోను ఫ్రేమ్ చేయించి బహుకరించుకున్నారు. అదే క్రమంలో పూర్వ విద్యార్థులు వారి భార్యాభర్తలతో కలిసి వినూతనంగా పెళ్లయిన రోజులు గుర్తుచేసుకొని, పూల దండలు మార్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులంతా కలిసి విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అనర్హులకు ఇళ్లు వస్తే కలెక్టర్లదే బాధ్యత

## మంత్రి కోమటిరెడ్డి సున్నితంగా హెచ్చరిక

ఖమ్మం /జనవరి 13(జర్నలిస్ట్ వార్త): : :అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, భవనాలు ఉన్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర వహించాల్సి వుంటుంది.. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దు.. గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కొంచెం ఇంపా÷-ట్గ÷ంట్ మీటింగ్ కారణంగా ఆలస్యంగా వచ్చానన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఆకస్మిక పర్యటనలు ఉంటాయని తెలిపారు. అక్రమాలు జరుగకుండా చూడాలన్నారు.
అలాగే, ప్రజా పాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు అని రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి తెలిపారు. వారి కోసం ఒక్కొక్కటిగా పని చేసి పెడుతున్నాం.. ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు. దీనికి గాను సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు.. దానికి మంత్రులు, అధికారులు అందరు హాజరయ్యారు.. ప్రతి అర్హుడైన పేదవాడికి న్యాయం జరిగేలా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. అర్హుడైన ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తాం.. రెవెన్యూ మంత్రి కూడ ఖమ్మం జిల్లాకు చెందిన వాడే ఆయన దగ్గర ఉండి మరి మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారు.. 16 నుంచి 26 వరకు అధికారులు కష్టపడి, ప్రతి గ్రామానికి వెళ్ళి సర్వే చేయాలి.. పేదలకు ఇళ్లు అందేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# ప్రకృతితో కలసి నడవడమే సంక్రాంతి పరమార్థం !


హైదరాబాద్/జనవరి 13(జర్నలిస్ట్ వార్త):
మన వేదాలు, ఉపనిషత్తులు సృష్టిలోని ప్రతి దానిలోనూ భగవంతుడిని చూడాలని చెప్పాయి. ప్రతి ఒక్కరూ తనలాగే చూడగలిగితే జీవితం సంతోషంగా సాగిపోతుంది. ప్రకృతి పట్ల కృతజ్ఞతతో ఉండటం అంటే ప్రకృతిని నాశనం చేయకుండా ఉండడమే. ప్రకృతితో కలిసి బతకడమే. అలా జీవించగలిగినప్పుడే ఎలాంటి విపత్తులు రావు. సంక్రాంతి కూడా ప్రకృతికి కృతజ్ఞత చెప్తూ జరుపుకునే పండుగే. సంక్రమణంలో భాగంగా పుష్య మాసంలో సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ పర్వకాలమే సంక్రాంతి. ఇది మూడు రోజుల పర్వం. పంట చేతికి అందటం వల్ల రైతులు ఆనందోత్సాహాలతో గడిపే సమయం ఇది. తమకు పాడిపంటలనిచ్చిన పండుగగా రైతులు సంక్రాంతిని కృతజ్ఞతా పూర్వకంగా జరుపుకొంటారు. పంటను చేతికిచ్చిన భగవంతుడికి, పొలాల్ని దున్నే ఎద్దులకు ఈ పండుగ ద్వారా ధన్యవాదాలు తెలుపుతారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వాల్లోని అంతరార్థం ఇదే. ఈ పండుగ నాటికి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ఇంటికి చేరుతుంది. అందుకే సంతోషంతో ఈ పండుగ చేసుకుంటారు. తమకు వ్యవసాయంలో సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతతో పూజిస్తారు. విత్తనం వేసింది మొదలు పంట నూర్పుళ్ళ వరకు సహాయం చేసినందుకు కూలీలకు పండిన ధాన్యంలో కొంత ఇస్తారు. అలాగే గంగిరెద్దుల హరిదాసులు, జంగాలు అందరూ ఈ పండగ రోజుల్లో కనిపిస్తారు. ప్రజలు సంతోషంగా వాళ్లకు దానధర్మాలు చేస్తారు. అందరూ కలిసి జీవించే సమైక్య జీవనానికి ప్రతీక సంక్రాంతి పండుగ. మకర సంక్రాంతి సూర్యుణ్ని ఉద్దేశించి చేసే మహా పర్వదినం. సూర్యుడు మానవ ప్రపంచానికి నేత్రం వంటివాడు. అతను లేకుంటే ప్రపంచానికి వెలుగు ఉండదు. సూర్యుడే మానవాళికి ఆరోగ్య ప్రదాత. సూర్యకాంతి వల్లే ప్రకృతి వికసిస్తుంది. సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది. మేఘాలు ఏర్పడతాయి.



వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. చెట్లు పెరుగుతాయి. మానవుల జఠరాగ్ని ఆరిపోకుండా ఉంటుంది. శరీర అవయవాలన్నీ చక్కగా పనిచేస్తాయి. ఈ విధంగా మకర సంక్రాంతి ఆరోగ్య కారకమైన పండుగగా కూడా విరాజిల్లుతున్నది.శ్రమైక జీవన సౌందర్యానికి, సామాజిక సమైక్య మాధుర్యానికి ప్రతీక సంక్రాంతి. సర్వజన హితాన్ని ఆకాంక్షిస్తూ, సమష్టి తత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఈ పండుగ. తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే ముచ్చటైన, ముగ్ధమనోహరమైన మూడు పండుగల సమాహారంగా సంక్రాంతి సౌందర్యం వెల్లివిరు స్తుంది. సంక్రాంతి అంటే 'చేరుట' అని అర్థం కూడా ఉంది. సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండుగతో సంబురాలు మొదలవుతాయి. భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజని అర్థం. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే సమయం కావటంతో రైతులు ఎంతో ఆనందంగా ఉంటారు. ఈ రోజు సూర్యోదయా నికి పూర్వమే నిద్రలేచి అభ్యంగన స్నానం చేసి, ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేస్తారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ భోగి మంటల్లో పనికిరాని దుస్తులు, వస్తువులను వేసి పీడలను, అరిష్టాలను తొలగించుకుంటారు. భోగి పండుగ రోజు ఉదయం పిల్లలకు స్నానాలు చేయించి కొత్తదుస్తులు వేసి వారిని తూర్పు వైపునకు కూర్చోబెట్టి రేగుపళ్లు, చిల్లర నాణేలను కలిపి వారి తలపై పోస్తారు. తర్వాత పిల్లలకు హారతి ఇస్తారు. ఇలా చేయడం ద్వారా వారిపై పడిన దిష్టి తొలగిపోతుందని భావిస్తారు. అంతేకాకుండా పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుంది. బాహ్య నేత్రాలకు కనిపించని బ్రహ్మరంధ్రం తలపై భాగంలో ఉంటుంది. భోగిపళ్లను తలపై పోయడం ద్వారా అవి బ్రహ్మ రంధ్రాన్ని ప్రేరేపిస్తాయి. తద్వారా పిల్లల బుద్ధి వికసిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. మకర సంక్రాంతి విశేష పర్వదినం. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఈ పుణ్యదినాన సూర్యునికి అర్ఘ్యాలు ఇవ్వడం, పూజలు చేయడం, దాన ధర్మాలు చేయడం పరిపాటి. కాల గమనం దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తున్నందున శరీరానికి సమతౌల్యం అవసరం. ఇందుకోసం నువ్వులు కలిపిన చక్కెరను తినడం, బెల్లంతో కలగలిపి చేసిన నువ్వుల లడ్డూలను తినడం కనబడుతుంది. పండుగ రోజున నెయ్యిని, కంబళ్లనూ, బెల్లాన్నీ, దానం ఇవ్వడం, ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులను వేయడం సంప్రదాయంగా వస్తున్నది. సూర్యుడి రథాన్ని ముగ్గుగా వేసి, దానిపై పేడతో చేసిన గొబ్బెమ్మలను, నువ్వులు, బియ్యం, చెరుకుగడలను ఉంచడం ప్రతి ఇంటి వాకిటా కనబడుతుంది.శ్రమైక జీవన సౌందర్యానికి, సామాజిక సమైక్య మాధుర్యానికి ప్రతీక సంక్రాంతి. సర్వజన హితాన్ని ఆకాంక్షిస్తూ, సమష్టి తత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఈ పండుగ. తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే ముచ్చటైన, ముగ్ధమనోహరమైన మూడు పండుగల సమాహారంగా సంక్రాంతి సౌందర్యం వెల్లివిరుస్తుంది. ఎన్నో ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, వైజ్ఞానికపరమైన అంశాలు ఈ వేడుకలో దాగి ఉన్నాయి. బొమ్మల పండుగ, ముగ్గుల పండుగ, పంటల పండుగ, పశువుల పండుగ, పెద్దల పండుగ, పెద్ద పండుగ? ఇలా సంక్రాంతికి ఎన్నో పేర్లు. వీటన్నిటికన్నా సంక్రాంతి అనగానే మనకు గుర్తుకు వచ్చేవి ప్రతి ఇంటి ముంగిటా మెరిసిపోయే ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల భజనలు, గంగిరెద్దుల ఆటలు, భోగిమంటలు, అరిసెలు, బొమ్మల కొలువు వంటివి ఆనందాన్ని ఇస్తాయి.

### బాక్సాఫీస్‌ను షేకాడిస్తున్న డాకు మహారాజ్..

# తొలిరోజే కలెక్షన్ల ఊచకోత!




నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటించిన హై వోల్టేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డాకు మహారాజ్ సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన సంగతి తెలిసిందే. మాస్ మువీలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచిన యువ డైరెక్టర్ బాబీ కొల్లి, బాలయ్య కాంబినేషన్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మువీ తొలి రోజు నుంచే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. మరోవైపు పాజిటివ్ రివ్యూలు, మౌత్ టాక్‌తో బాలకృష్ణ సాలీడ్ ఓపెనింగ్స్ మంచి బజ్ క్రియేట్ చేసింది. బాలయ్య వన్ మ్యాన్ షో అంటూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ మూవీ ఫస్ట్ డే బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. డాకు మహరాజ్ ప్రపంచ వ్యాప్తంగా తొలి రోజు ఏకంగా రూ.56 కోట్లు వసూలు చేసింది. ఇక ఈ రోజు ఆదివారం, పైగా పండగా కూడా.. దీంతో థియేటర్లన్నీ కిటకిటలాడిపోతున్నాయి. గాడ్ ఆఫ్ మాసెస్ బాలయ్య దూకుడుకు బాక్సాఫీస్ కలెక్షన్ తో పాటు అన్నిచోట్ల థియేటర్ ఫుల్ ఆక్యుపెన్సీ కూడా నమోదు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ రోజు కూడా బ్లాక్‌బస్టర్ జోరును కొనసాగిస్తోంది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ మువీ సంక్రాంతి సెలవుల్లో బాక్సాఫీస్‌ను మరింత కొల్లగొట్టే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు. కాగా అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టి మాంచి ఊపులో ఉన్న బాలయ్య.. ఇప్పుడు మరో విజయాన్ని తన ఖాతాలో జమ చేసుకున్నాడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు భారీ బడ్జెట్‌తో డాక్ మహరాజ్ మువీని నిర్మించారు. ఇందులో బాలకృష్ణ సరసన ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటించగా శ్రద్ధా శ్రీనాథ్ , చాందినీ చౌదరి, ఊర్వశి రౌతేలా, సచిన్ ఖేడేకర్, హర్షవర్ధన్, హిమజ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇక బాలీవుడ్ స్టార్ యాక్టర్ బాబీ డియోల్ ప్రతినాయకుడు (విలన్) పాత్రలో అలరించారు. పాటల మాంత్రికులు థమన్ స్వరాలు సమకూర్చారు. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రహణం, రూబెన్ %-% నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ అందించారు.

### చేసినా సినిమాలన్నీ యావరేజ్..

# ఒక్క సినిమాతో పాన్ ఇండియాను షేక్ చేసింది



సెలబ్రెటీ ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీలోకి నటిగా అడుగుపెట్టింది. ప్రస్తుతం ఇండస్ట్రీలో భారీ రెమ్యునరేషన్ తీసుకుంటున్న బ్యూటీస్ లో ఆ అమ్మడు ఒకరు. చిన్నవయసులోనే కోట్ల రూపాయిలను సంపాదించింది. అలాగే సోషల్ మీడియాలో నిత్యం గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తూ నెటిజన్స్ మతిపోగొట్టేస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ వయసు 27 సంవత్సరాలు. కానీ కోట్ల కొద్దీ ఆస్తిపాస్తులు కూడబెట్టింది. చాలా కాలంగా హిట్స్ లేక సతమతం అయిన ఈ వయ్యారి గతేడాగి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ హిట్ ఖాతాలో వేసుకుంది. దీంతో ఈ బ్యూటీ క్రేజ్ మారిపోయింది. ఒకే ఒక్క సినిమాతో ఏకంగా ఇండస్ట్రీని షేక్ చేసింది. ఇంతకు ఆ హీరోయిన్ ఎవరో తెలుసా.. ? ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో ఓరేంజ్ ఫాలోయింగ్ క్రియేట్ చేసుకున్న ముద్దుగుమ్మ. హిందీలో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నటిగా అద్భుతమైన నటనకు ప్రశంసలు అందుకున్న జాన్వీకి సరైన బ్రేక్ రాలేదు. గతేడాది యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన దేవర సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సూపర్ హిట్ కావడంతో ఈ అమ్మడు క్రేజ్ ఊహించని రేంజ్ లో మారిపోయింది. దీంతో తెలుగులో మరిన్ని ఆఫర్స్ క్యూ కట్టాయి. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన డైరెక్టర్ బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న మూవీలో నటిస్తుంది. అలాగే దేవర పార్ట్ 2లో నటిస్తుంది. దేవర సినిమా తర్వాత జాన్వీ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. 27 ఏళ్ల వయసులోనే కోట్ల ఆస్తిని కూడబెట్టింది. తల్లి స్టార్ హీరోయిన్, తండ్రి బడా నిర్మాత అయినా కూడా జాన్వీ సొంతంగా సంపాదిస్తూ కోట్లు సంపాదించింది. కొన్ని రోజుల క్రితం ఓ ఖరీదైన బంగ్లాను కొనుగోలు చేసింది. అలాగే ఈ అమ్మడి దగ్గర కాస్ట్లీ కార్లు ఉన్నాయి. అలాగే సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు వెర్రెక్కిస్తుంది.

## మన్మథుడు హీరోయిన్ అన్షుపై హాట్ కామెంట్స్ దుమారం..

## డైరెక్టర్ త్రినాథరావు నక్కిన క్షమాపణలు





త్రినాథ రావు నక్కిన డైరెక్షన్‌లో సందీప్ కిషన్ హీరోగా నటిస్తోన్న చిత్రం మజాకా. రీతూవర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రలో నటిస్తోంది. కాగా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో త్రినాథరావు నక్కిన చేసిన కామెంట్స్ ఇండస్ట్రీ సర్కిల్‌లో తీవ్రదుమారం రేపాయి. ఈవెంట్‌లో త్రినాథ రావు నక్కిన మాట్లాడుతూ.. మన్మథుడు సినిమా తర్వాత అన్షు ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉందంటూ.. ఆమె ఫారిన్ నుంచి వచ్చాక సన్నగా ఉందని, కాదమ్మా తెలుగుకు సరిపోదు, కొంచెం అన్నీ ఎక్కువ సైజుల్లో ఉండాలని చెప్పా.. పర్లేదు ఇప్పుడు కొంచెం ఇంప్రూవ్ అయిందంటూ కామెంట్ చేశాడు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవడమే కాకుండా మహిళా కమిషన్ దృష్టికి కూడా వెళ్లింది. త్రినాథరావు వ్యాఖ్యలను సుమోటోగా సీక్వరించిన మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ల శారద.. త్వరలోనే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా త్రినాథరావు ఎక్స్ వేదికగా క్షమాపణలు తెలియజేస్తూ వీడియో విడుదల చేశాడు. అందరికీ నమస్కారం.. ముఖ్యంగా మహిళలకు, అన్షుకు.. నా మాటల వల్ల బాధపడ్డ ఆడవాళ్లందరికీ నా క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను, నా ఉద్దేశ్యం ఎవరిని బాధ కలిగించడం కాదు తెలిసి చేసినా తెలియకుండా చేసిన తప్పు తప్పే మీరందరూ పెద్ద మనసు చేసుకొని నన్ను క్షమిస్తారని కోరుకుంటున్నానన్నారు.

## అజిత్ కుమార్ విదాముయార్చి ట్రైలర్ అనౌన్స్‌మెంట్ టైం ఫిక్స్!

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి ఒకటి. ఏకే 62గా వస్తోన్న ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ ట్రైలర్‌ను ఎప్పుడు లాంచ్ చేయబోతున్నారనే దానిపై రేపు క్లారిటీ ఇవ్వనున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్ర పోషిస్తుండగా.. రెజీనా కసాండ్రా మరో కీ రోల్‌లో నటిస్తోంది. ఆరవ్ కీ మరో ముఖ్య పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే విదాముయార్చి నుంచి షేర్ చేసిన పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రంలో అజిత్ కుమార్ మరోవైపు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో ఏకే 63 కూడా చేస్తున్నాడు. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ మూవీని జనవరి 31న కానీ లేదా ఫిబ్రవరి 7న కానీ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు హల్ చల్ చేస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

